క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ



యూనిఫామ్ అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖమ్మం ఎంపీగా ఎన్నికై ఏడాదైన సందర్భంగా గురువారం విద్యానగర్‌లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళి, జీవీఎస్ చౌదరి, చీకటి కార్తీక్, తోట దేవీప్రసన్న, శ్రీనివాసరెడ్డి, ఎండీ రజాక్, తలుగు అనిల్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

ఇల్లెందు: ఇల్లెందు మైనార్టీ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో చేరగోరువారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు 9666286874లో సంప్రదించాలని కోరారు.

నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: చల్లసముద్రం పెద్దచెరువుతోపాటు మరో ఆరు చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. 'ప్రమాదకరంగా చల్లసముద్రం పెద్ద చెరువు'శీర్షికతో ఈ నెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. చెరువు దుస్థితిపై అంచనాలు రూపొందించిన అధికారులు అనుమతుల కోసం వేచిస్తున్న క్రమంలో కథనం ప్రచురితం కావడం అధికారులను కదిలించింది. మండలంలోని ఏడు చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ శాఖ డీఈ భాగ్యరాజ్, ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. త్వరలోనే టెండర్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని వివరించారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి..



రాజేందర్, ఎస్‌ఐ

టేకులపల్లి: ఈనెల 14న జరగనున్న మెగా లోక్ అదాలత్ కార్యక్రమాలను వివిధ కేసుల్లో ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి ఎస్‌ఐ ఎ.రాజేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం మాట్లాడుతూ.. టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. గొడవల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని, రాజీమార్గమే ఉత్తమమన్నారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 వరకు ఇల్లెందు కోర్టులో మెగా లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. యాక్సిడెంట్, కొట్టుకున్న ఘటనలు, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించిన, దొంగతనం కేసులు, ఇతర రాజీపడదగిన కేసులను క్లోజ్ చేసుకోవచ్చని తెలిపారు. రాజీ పడాల్సినవారు ఆధార్ కార్డు తీసుకుని ఇల్లెందు కోర్టుకు రావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్‌సీడీ పీఓ డాక్టర్ మధురం సూచించారు. కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలలో గురువారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రమం తప్పకుండా తమకు కేటాయించిన గ్రామాలలో పర్యటిస్తూ జ్వరాల తీవ్రతను అధ్యయనం చేయాలన్నారు. దోమల ఉత్పత్తిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 45 రోజుల పాటు నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గృహిణులు 83 మంది హాజరై శిక్షణ పొందారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ఏభాష అయినా నేర్చుకోవడానికి శ్రద్ధ ఉండాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రకృతిని కాపాడుకుందాం..

- ఘనంగా ప్రపంచ పర్యావరణ వేడుకలు
- మొక్కలు నాటిన అధికారులు, ఉద్యోగులు
- ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దని ప్రతిజ్ఞ



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐటీసీ –వావ్ ఇ–శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూలీలైన్ ఏరియా ప్రదర్శన నిర్వహించి, ఎంజీ రోడ్డులో మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీసీఎం రాజేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ ఆవరణలో.. నూతన కార్యదర్శి కే.కరుణ కుమారి గ్రంథాలయ ఆవరణలో మొక్క నాటారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏరియాలోని అధికారులు, ఉద్యోగులతో కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. జీఎం మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగింపు పలకాలనే నినాదంతో ఈ ఏడాది ఈ వేడుకలను ప్రారంభించామన్నారు. భవిష్యత్ తరాలు కాలుష్యం బారిన పడకుండా ఉండాలంటే పర్యావరణాన్ని రక్షించాలని తెలిపారు. ఈరోజు నుంచి ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని, కాటన్ లేదా జనపనార సంచులను వాడాలన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్, గుర్తింపు సంఘం నాయకుడు మల్లికార్జున్‌రావు, అధికారుల సంఘం నాయకులు వైవీరావు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ హనుమలత, ఎన్విరాల్‌మెంట్ ఇన్‌చార్జ్ టి.సత్యనారాయణ, డీజీఎం యోహాన్, మదన్‌మోహన్, బి.మాధవ్, మజ్జి మురళి, సంఘమిత్ర, బి.తావుర్యా, సాగర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలూరుపాడు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం వినోభానగర్ నర్సరీలో ఘనంగా నిర్వహించారు. వీఎస్ఎస్ సభ్యులు, గ్రామస్తులు, అటవీ సిబ్బంది 100 మొక్కలు నాటి, పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఆర్‌ఓ ఎస్కే నాసూర్‌భీ, ఎఫ్‌బీఓలు రేఖ, ఎస్కే రహీమ్, శ్రీలత, శరణ్, వెంకటేశ్వర్లు, వీఎస్ఎస్ చైర్మన్ బానోత్ రూప్లా పాల్గొన్నారు.

ఇల్లెందు: పర్యావరణ పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఇల్లెందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో లేక్ వ్యూ పార్క్, చెరువు కట్ట మీద అమృత మిత్రల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం చెరువులో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు ఎత్తివేశారు. కమిషనర్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి పెను ప్రమాదంగా తయారైన ప్లాస్టిక్‌ను నిరోధించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీ, ఏఈ నవీన్, టీఎంసీ నాగయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

సింగరేణిలో.. ఇల్లెందులోని జీఎం కార్యాలయం ఆవరణలో అధికారులు, ఉద్యోగులు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఎస్‌ఓటూ జీఎం రామస్వామి ఆధ్వర్యంలో ఏరియాలోని గనులు, విభాగాల్లో మొక్కలు నాటారు. అధికారులు గిరిధర్‌రావు, నరసింహరాజు, జీవీ మోహన్‌రావు, రవికుమార్, మధుబాబు, దిలీప్, జె.వెంకటేశ్వర్లు, లచ్చిరాం తదతరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇల్లెందు కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి మొక్కలు నాటారు. బార్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, దంతాల ఆనంద్, వెంకటనర్సయ్య, సుధాకర్, నవీన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటూ మొక్కలు పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా అటవీశాఖాధికారి కృష్ణగౌడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిధి కిన్నెరసాని డీర్ పార్క్ వద్ద గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడారు. పార్క్ పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెట్లు ఎక్కువగా ఉంటేనే పర్యావరణ సమతుల్యత ఉంటుందని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ఎఫ్‌డీఓలు కృష్ణమాచారి, కట్టా దామోదర్ రెడ్డి, రేంజర్లు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఇల్లెందు ఎఫ్‌ఆర్‌ఓ డీవీఎస్‌కే ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం అటవీశాఖ కార్యాలయం ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, నేచర్ పార్క్‌లో మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. భావితరాలను స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు నేటితరం మొక్కలు నాటి పెంచాలన్నారు. డీఆర్‌ఓలు వీరబాబు, ఎఫ్ఎస్‌ఓలు రంగ్యా, వీర్రాజు, నేచర్ పార్క్ ఎఫ్‌బీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకలు, విద్యార్థులు మొక్కలు నాటారు.

టేకులపల్లి: టేకులపల్లి రేంజ్ ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పర్యావరణ ఆవశ్యకత, హరితహారం తదితర వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఫారెస్టు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మొక్కలను నాటడంతో పాటు స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఎఫ్‌ఆర్‌ఓ ముఖ్తార్ హుస్సేన్, ఎఫ్ఎస్‌ఓ, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: నేచర్ పార్క్‌లో మొక్క నాటుతున్న ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్, సిబ్బంది



కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది



ఇల్లెందు: ఆర్పీలు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కమిషనర్ శ్రీకాంత్



టేకులపల్లిలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అటవీ అధికారి



జూలూరుపాడు: వినోభానగర్ నర్సరీలో మొక్క నాటి నీళ్లు పడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు



సింగరేణి(కొత్తగూడెం): పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు

నేటి నుంచి బడిబాట

జూలూరుపాడు: నేటి నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జరగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన, బడి ఈడు, బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.

రోజువారి నివేదికలు పంపించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మండలంలో శుక్రవారం నుంచి జరగనున్న బడిబాట కార్యక్రమాలను ప్రభుత్వం సూచించిన విధంగా నిర్వహించాలని, రోజువారి నివేదికలను మండల కార్యాలయానికి పంపించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల బాధ్యులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. మొదట కలెక్టర్ స్ఫూర్తితో కొత్తగూడెం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 6న గ్రామసభ నిర్వహించి పాఠశాల పనితీరు, ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాల గురించి వివరించాలన్నారు.

పాఠశాల ఆవాస ప్రాంతంలో గల బడిఈడు గల పిల్లలంతా వందశాతం బడుల్లో చేరేలా తోడ్పాటు అందించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీలు పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య అధికంగా పెరగాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన బడిబాట సన్నాహక సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, మండల నోడల్ ఆఫీసర్ ప్రకాశ్, హెచ్‌ఎం పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీసీసీ మేనేజర్‌గా నర్సింహారావు

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పాల్వంచ బ్రాంచి మేనేజర్‌గా ఇల్లెందు జీసీసీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నర్సింహారావును నియమిస్తూ ఐటీడీఏ పీఓ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎం సమ్మయ్య తెలిపారు. ప్రస్తుత మేనేజర్ లక్ష్మీజీ ఉద్యోగ విరమణ పొందారు.

పాల్వంచను రక్షించుకుందాం..



సమావేశానికి హాజరైన ప్రముఖులు

పాల్వంచ: పాల్వంచ మనుగడపై స్థానికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పలు పార్టీల నాయకులు, నగర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక రెస్టారెంట్‌లో ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... నాడు పాల్వంచ ఐటీడీఏగా, డివిజన్ కేంద్రంగా ఉండగా కాలక్రమేణ మండల కేంద్రం చేశారని, ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీని నేడు కార్పొరేషన్ పేరుతో కొత్తగూడెంలో కలిపారన్నారు. ఇప్పటికే కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం తొలగించడం, ఎన్ఎండీసీ మూతబడటం, ఇతర కొత్త పరిశ్రమలేవీ ఇక్కడ తెచ్చే ప్రయత్నం చేయకపోవడం, నవభారత్ కంపెనీలో ఉత్పత్తి తగ్గి ఉద్యోగుల సంఖ్య తగ్గడం వంటి పరిణామాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. కార్పొరేట్ స్థాయి షాపింగ్ మాల్స్ వస్తుండటంతో ఇక్కడి స్థానిక వ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. వార్డుల విభజన అశాస్త్రీయంగా ఉందన్నారు. కార్పొరేషన్ వల్ల ఆస్తుల విలువ పెరుగుతాయని చెబుతున్నారని, పెరిగినా కొనేవారే లేరని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో విలీనానికి ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేయకపోవడం దారుణం అన్నారు. పాల్వంచ ఘన చరిత్రను కనమరుగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టి కలిసి కట్టుగా పోరాడి, పాల్వంచను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, మంతపురి రాజుగౌడ్, దొడ్డా రవికుమార్, జలీల్, కాల్వ భాస్కర్, కాంపెల్లి కనకేష్, పొట్రు ప్రవీణ్, చలవాది ప్రకాష్, బుడగం రవి, సత్య, చింతా నాగరాజు, సైదులు, చారి, రమేష్ రాథోడ్, బండి లక్ష్మణ్, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డివిజన్ల విభజన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కార్పొరేషన్‌లో డివిజన్ల విభజన అశాస్త్రీయంగా ఉందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... ప్రభుత్వ జీఓ ప్రకారం సుమారు 1.34 లక్షల ఓటర్లు కలిగిన కార్పొరేషన్‌లో 60 డివిజన్లు, ప్రతీ డివిజన్‌కు 2,400 ఓట్ల వరకు ఒక డివిజన్ చేయాలి, కానీ, 2000 ఓట్ల లోపు కూడా రాజకీయం చేసి డివిజన్లు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలోగంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, సాయి, నున్న శివచౌదరి, పూణెం మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 74 మందికి రూ.23 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. దొడ్డా డానియేల్, పులి సైదులు, సుదర్శన్ కోరీ, మండల రాము, మడుగు సాంబమూర్తి, గండె సదానందం, చిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ధర్మా

జూలూరుపాడు: ప్రస్తుత ఉప మార్కెట్‌ను శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ... ఉప మార్కెట్ సెస్ ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తోందన్నారు. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం 10 ఎకరాల భూమి కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఎన్నికలప్పుడు నాయకులు శాశ్వత మార్కెట్ నిర్మాణానికి హామీ ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో లకావత్ గిరిబాబు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, మూడ్ చిట్టిబాబు, ఎస్కే నాగుల్‌మీరా, రోకటి నరసింహారావు, బొల్లు లక్ష్మయ్య, లకావత్ నాగేశ్వరరావు, బానోత్ రాంబాబు, తోటకూరి నరేష్, తాళ్లూరి లక్ష్మయ్య, ఎస్కే చాంద్‌పాషా పాల్గొన్నారు.

హెడ్డాఫీస్ ఎదుట సులభ్ కార్మికుల ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సులభ్ కాంట్రాక్ట్ కార్మికుల చట్టబద్ధమైన హక్కుల సాధనకై గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ మాట్లాడుతూ... పర్మనెంట్ కార్మికుల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యం సామూహిక మరుగుదొడ్లను నిర్మించి ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.25 వేలు ఇస్తోందని, ఇందులో రూ.15వేలు సఫాయి కర్మచారి వేతనం, రూ.వెయ్యి మెటీరియల్ అంటే రూ.16వేలు మాత్రమే చెల్లిస్తుందని, 9వేలు సులభ్ కాంప్లెక్స్‌కు కమీషన్‌గా ఇస్తోందన్నారు. రూ.కోట్ల లాభం వస్తున్నప్పటికీ సులభ్ కార్మికులను శ్రమదోపిడీ చేస్తోందన్నారు. సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు ఏవిధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారో అదేవిధంగా సులభ్ కాంప్లెక్స్ కార్మికులకు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 16 నుంచి జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన, నిరసన కార్యక్రమాలు, అవసరమైతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఎ.వెంకన్న, బ్రహ్మానందం, గౌని నాగేశ్వరరావు, టి.శ్రీనివాస్, బి.అశోక్, మల్లెస్, నెమిళ్ల సంజీవ్ పాల్గొన్నారు.

నాలుగు డివిజన్లుగా ఏడు పంచాయతీలు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సుజాతనగర్: కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటైన తరువాత డివిజన్ల విభజన చేపట్టారు. 60 డివిజన్లుగా మార్చిన నేపథ్యంలో.. సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలు నాలుగు డివిజన్లుగా మారాయి. 39వ డివిజన్‌లో నిమ్మలగూడెం, కోమటిపల్లి, హరిజనవాడ, గొల్లగూడెం, సుందరయ్యనగర్, అంబేద్కర్‌నగర్, 40వ డివిజన్‌లో నాయకులగూడెం, సుజాతనగర్‌లోని సిరిపురంలో కొంతభాగం, 41వ డివిజన్‌లో సిరిపురంలో కొంత భాగం, కేశవాపురం, వేపలగడ్డ ప్రాంతాలు, 42వ డివిజన్‌లో నర్సింహసాగర్, మంగపేట, లక్ష్మీదేవిపల్లి, గాయత్రీనగర్ గ్రామాలను ఏర్పాటు చేశారు. సదరు గ్రామ పంచాయతీలపై కేఎంసీ అనే పేరును ఏర్పాటు చేశారు.

ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలి..

సుజాతనగర్: లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, కోమటిపల్లి మూడు గ్రామ పంచాయతీలను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని విలీన గ్రామప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాతకు గురువారం వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ... నిమ్మలగూడెం, కోమటిపల్లి పంచాయతీలను 39వ డివిజన్‌లో, లక్ష్మీదేవిపల్లి పంచాయతీని 42వ డివిజన్‌లో ఏర్పాటు చేశారని, దీనివలన ఈ గ్రామాల్లో ఉండే దళిత గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా సుమారు రెండు వేల వరకు ఉందని, సుజాతనగర్‌లో విలీనం చేయడం వలన గిరిజన తండాలు అభివృద్ధి చెందే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు గణేష్, తుంపూరి రాములు, భూక్యా రాజేష్, భూక్యా భీమా, భగత్‌సింగ్, శ్రీను, రాజేష్, బండి అమృతరావు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఈనెల 3న ప్రారంభమైన పార్వతీ సమేత రామలింగేశ్వర, పంచముఖ, ఆంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, నంది, ఉష్ట్రవాహన, శిఖర పూజా కార్యక్రమాలు, ప్రతిష్ఠ గురువారం ఘనంగా ముగిశాయి. దేవతామూర్తుల విగ్రహాలకు వేదపండితులు నాగ ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది మంది వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మేళతాళాల నడుమ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదానం నిర్వహించారు.

కమ్యూనిటీ హాళ్లలో కష్టాలు

- కార్మికుల ఇబ్బందులను పట్టించుకోని సింగరేణి అధికారులు
- నీరు, విద్యుత్ సౌకర్యం సరిగ్గా లేవని ఆవేదన



ఆధునికీకరణ తర్వాత ఇటీవల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ బలరామ్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, కమ్యూనిటీ హాల్, సీఈఆర్ క్లబ్, రామవరం కమ్యూనిటీ హాళ్లను సమస్యలు వేధిస్తున్నారు. కనీసం తాగునీటికి బోర్లు, మోటార్లు లేక వేడుకలు చేసుకోవాలనుకునే కార్మిక కుటుంబాకులు ఇబ్బంది పడుతున్నాయి. సింగరేణి ద్వారా ఏరియా మొత్తానికి నీరు సరఫరా అవుతున్నా కమ్యూనిటీ హాళ్లకు సరైన సదుపాయం ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతున్నారు. ఫంక్షన్ హాల్‌కు పైప్‌లైన్ వేస్తే తక్కువ ఖర్చుతో నీటి సరఫరా చేసే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తే కమీషన్లు వస్తాయనే భావనతో అధికారులు మొగ్గు చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.లక్షలు వెచ్చించినా...

రామవరం కమ్యూనిటీ హాల్‌ను ఇటీవల రూ.లక్షలు వెచ్చించి ఆధునికీకరించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఏసీలు బిగించలేదు. ఇక ఒకే విద్యుత్ లైన్ ఉండడంతో విద్యుత్ సమస్య ఏర్పడితే ఆరోజు ఫంక్షన్ జరుపుకునే వారికి ఆవేదన అంతుపట్టదు. ప్రత్యామ్నాయంగా జనరేటర్ కూడా లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. కార్మికుల కుటుంబాలు ఉపయోగించుకునే ఫంక్షన్ హాల్ కావడంతోనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే, పార్కింగ్, వాష్ ఏరియా, రెండో గేట్ ఏర్పాటు.. పశువులు రాకుండా క్యాటిల్ గార్డు కూడా లేకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ హాళ్లలో సమస్యలు పరిష్కరించాలని, వసతులు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

బోర్ వేస్తేనే ఫలితం...



కమ్యూనిటీ హాల్ రినోవేషన్‌కు యాజమాన్యం రూ.28 లక్షలు వెచ్చించింది. కానీ నీటి వసతి కల్పించకపోగా ప్రత్యేకంగా వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయలేకపోయింది. ఈ సమస్య పరిష్కారానికి బోర్ వేసి మోటార్లు బిగించడమే కాక ప్రత్యేక లైన్ ద్వారా నీటి సరఫరా చేయాలి.

– ఎం.డీ.రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు (ఐఎన్‌టీయూసీ)

ఎన్నో ప్రత్యామ్నాయాలు



సింగరేణికి కరెంట్ కొదువ కాదు. సోలార్ ప్లాంట్ ద్వారా సపరేట్‌గా లైన్ ఏర్పాటు చేయొచ్చు. లేదంటే కమ్యూనిటీ హాల్‌పైనే ఒక సోలార్ యూనిట్ పెట్టే అవకాశం ఉంది. ఇవన్నీ కాకపోతే జనరేటర్ ఏర్పాటు చేసినా ఉపయోగించుకున్న వారి నుంచే చార్జీ వసూలు చేసుకోవాలి.

– ముస్తఫా, రామవరం పరిరక్షణ కమిటీ చైర్మన్

క్యాటిల్ గార్డ్ ఉంటే మేలు



ఫంక్షన్ హాల్‌కు భద్రత లేక ఆవులు, పందులు, కోతులు వచ్చి ఇబ్బంది పెడుతుంటాయి. ఫంక్షన్ జరిగే రోజుల్లోనైనా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేయాలి. అలాగే, మెయిన్ గేట్ వద్ద క్యాటిల్ గార్డ్ ఏర్పాటు చేస్తే లోపలకు జంతువులు వచ్చే అవకాశం ఉండదు.

– విజయగిరి శ్రీనివాస్, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి